క్లుప్తంగా

లీగల్ మెట్రాలజీ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తూనికలు, కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ జనార్దన్

బోట్‌క్లబ్: తూనికలు కొలతల శాఖ సూచనలు, సలహాలు తప్పకుండా పాటించాలని ఆశాఖ డిప్యూటీ కంట్రోలర్ జనార్దన్ వ్యాపారులకు సూచించారు. స్థానిక తూనికలు, కొలతలశాఖ కార్యాలయంలో బుధవారం వినియోగదారుల కోసం తూనికలు, కొలతలశాఖ రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. వ్యాపారులు వినియోగదారులను మోసం చేస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలి? తూనికలు, కొలతల్లో జరిగే అక్రమాలు తెలుసుకోవడం ఎలా? వంటి సలహాలు, సూచనలు ఈ పోస్టర్‌లో రూపొందించినట్లు చెప్పారు. లీగల్ మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా నగరంలో వివిధ ప్రాంతాల్లో వినియోగదారుల కోసం 150 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ సలీం పాల్గొన్నారు.

ఉగ్రవాదంతో ప్రపంచ శాంతికి ముప్పు

బోట్‌క్లబ్: ఉగ్రవాదం అనేది ఒక పదం కాదని ఇది మానవాళికి, ప్రపంచ శాంతికి ముప్పని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి చిట్ల కిరణ్ అన్నారు. స్థానిక భానుగుడి సెంటర్‌లో ఇండియన్ డెంటల్ అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. భారతదేశంలో స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఉగ్రవాద ముప్పును ఎదుర్కొంటోందన్నారు. ఉగ్రవాద చర్యల వల్ల అనేక మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. డెంటల్ అసోసియేషన్ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ తీవ్రవాదాన్ని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు భారత్ ఆర్మీ అర్ధరాత్రే సూర్యుడిని చూపించారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు భాస్కర్, సిరాజ్, నాగేంద్ర, శ్రీవల్లీ, భాను పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ సిటీ: ఈనెల 23వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కాకినాడ రెవెన్యూ కాలనీ ఫీడర్ విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు కాకినాడ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప, నూకల మాన్యం, రెవెన్యూ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు టీడీపీ జిల్లా మహానాడు

కాకినాడ సిటీ: టీడీపీ ఆధ్వర్యంలో జిల్లా మహానాడు కాకినాడలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ బుధవారం విలేకర్లకు తెలిపారు. గురువారం రాజా ట్యాంక్ వద్ద ఉన్న గోదావరి కళాక్షేత్రంలో ఈ మహానాడు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై 25న సదస్సు

బోట్‌క్లబ్: ప్రకృతి వ్యవసాయంపై ఈ నెల 25న కాకినాడ దంటు కళాక్షేత్రంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రకృతి రాగా సంస్థ అధినేత అజ్జరపు మల్లికార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సహస వ్యవసాయ విధాన సాధకులు విజయ్‌రామ్ పాల్గొంటారన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం ఐదు గంటలు వరకూ ప్రకృతి వ్యవసాయంతోపాటు, నీటి, గో సంరక్షణపై ప్రసంగిస్తారన్నారు. రైతులు ఈ అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

కాకినాడ సిటీ: ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ ముమ్మిడి లక్ష్మణ్‌పై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలని స్థానిక విలేకరులు దుర్రాని, వాతాడ నవీన్‌రాజ్, కాకినాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్ తదితరులు జేసీ రాహుల్ మీనాకు బుధవారం వినతి పత్రం అందజేశారు. పిఠాపురం నియోజకవర్గంలో మట్టి అక్రమ తవ్వకాలపై కథనాలు రాస్తున్నందుకు ఈ విష ప్రచారం చేస్తున్నారని వారు జేసీకి వివరించారు. దీనికి జేసీ స్పందిస్తూ త్వరలోనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ పిలుపు మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

సత్తెమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

సామర్లకోట: స్థానిక ఐఎంఎఫ్ఎల్ డిపోలో సత్తెమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. శిథిలమైన ఈ ఆలయాన్ని డిపో మేనేజరు కె.రామకృష్ణ దంపతుల కర్తృత్వంలో పునర్నిర్మించనున్నారు. కార్యక్రమంలో కౌడా చైర్మన్ తుమ్మల బాబు, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు పాల్గొనగా, వేమూరి చంటి, సన్నిధిరాజు అంజిబాబు పూజాదికాలు నిర్వహించారు.

పక్కదారిలో పక్వం!

- మధురఫలాన్ని విషమయం చేస్తున్న రసాయనాలు
- మామిడి పండ్లను పండించేందుకు వ్యాపారుల అడ్డదారులు
- మార్కెట్‌ని ముంచెత్తుతున్న రసాయన పూత మామిడి పండ్లు
- రకానికో రసాయనం
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం



మెక్లారెన్ గ్రౌండ్ వద్ద మామిడి పండ్ల వ్యాపారం



తెల్లటి చారలతో ఉన్న రసాయనాలు చల్లిన మామిడి పండ్లు

కాకినాడ క్రైం: మధురఫలం విషతుల్యమవుతోంది. మామిడి పండ్ల విక్రయాల్లో లాభాపేక్షే పరమావధిగా సాగుతున్న అడ్డగోలు వ్యాపారాలు ప్రజారోగ్యానికి ప్రాణసంకటంగా పరిణమిస్తున్నాయి. ఫలం కొంటున్నామనుకుంటూ అనారోగ్యాలను పరకల్లో కొని తెచ్చుకుంటున్నాం. ఇంటిల్లిపాదీ కడుపారా తినాలని ఏడాది పొడుగునా ఎదురు చూసే మామిడి పళ్లు రసాయనాల్లో మునిగితేలుతూ తినేవారికి ముప్పు తెస్తున్నాయి. నగరంలో ఏ మూల చూసినా మామిడిపండ్లు విస్తారంగా లభ్యమవుతున్నాయి. దీంతో ధరలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో మామిడికాయల్ని పక్వానికి తెచ్చేందుకు అడ్డదారులు తొక్కుతున్న వ్యవహారశైలిపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో పసుపు వర్ణ నిగారింపుతో నోరూరిస్తున్న మామిడిపండ్లను తినాలన్నా భయమేసే పరిస్థితి ఆరోగ్య ప్రియుల్లో నెలకొంది.

ఈ రసాయనాలతో ప్రమాదం

తక్కువ ధరకు లభించే రసాయనం కాల్షియం కార్బైడ్. ఇది దేశంలో పూర్తిగా నిషేధించబడింది. అటువంటి రసాయనంతో మామిడి పండ్లను పక్వానికి తెస్తున్నారు. ఈ రసాయనాన్ని నీటిలో కలిపినప్పుడు అసిటిలిన్ గ్యాస్ విడుదల అవుతుంది. అలాగే నేరుగా మామిడికాయలపై ఈ పొడిని చల్లుతారు. ఎథిఫోన్ పక్వానికి వినియోగించే మరో ప్రత్యామ్నాయ రసాయనం. పండ్లపై తక్కువ మోతాదులో వినియోగించినా చాలు. మంచి రంగు వచ్చి పండినట్లు కనిపిస్తాయి. ఈ రెండు విధానాలు ప్రజల ఆరోగ్యానికి హానికరం. అయితే, తక్కువ వ్యయంతో కూడిన రసాయనాలు కావడం వల్ల వీటిని విరివిగా వాడుతుంటారు.

సహజంగా పండినవి గుర్తించండిలా..

- పండు అతి పసుపు రంగులో ఉంటే కొనవద్దు.
- ఇథలీన్ చిప్స్, ఇథలీన్ బ్యాగ్స్‌లో పండించే పండ్లను తినొచ్చు.
- సహజ మామిడికి సుగంధం ఉంటుంది.
- పచ్చ, పసుపు రంగులో ఉంటే సహజంగా పండినట్లు గుర్తించాలి.
- తొడిమ మెత్తగా ఉంటే సహజంగా పండినట్లే
- సహజ మామిడికి మచ్చలు ఉండొచ్చు.
- సీజన్ కంటే ముందు, సీజన్ తర్వాత వచ్చే పండ్లు కొనొద్దు.
- స్థానిక రైతులు, సేంద్రియ మార్కెట్ల నుంచి కొనుగోలు చేయాలి.
- సహజంగా పండినవి క్రమంగా కుళ్లుతాయి, రసాయనాలతో పండినవి ఒక్కసారిగా కుళ్లి చెడిపోతాయి.
- తాకితే మృదువుగా ఉంటుంది, రసాయన ఫలం గట్టిగా ఉంటుంది.

ఇథలిన్ గ్యాస్‌కు అనుమతి

నియంత్రిత గదుల్లో మామిడి కాయలపై ఇథలిన్ గ్యాస్‌ను పంపి మామిడి కాయలను ముగ్గిస్తారు. ఈ విధానానికి శాస్త్రీయత ఉంది. ప్రక్రియను వ్యవసాయ శాఖ అధికారికంగా అనుమతించింది.

నగరంలో వ్యాపారం కళకళ

కాకినాడ నగరంలో మార్కెట్లు మామిడి పండ్లతో కళకళలాడుతున్నాయి. లభ్యత ఎక్కువ కావడం వల్ల ధరలు గణనీయంగా తగ్గాయి. కాకినాడలో మెక్లారిన్ సహా మెయిన్ రోడ్, జేఎన్‌టీయూకే రోడ్, సర్పవరం, రమణయ్యపేట మార్కెట్, బస్టాండ్, రైతు బజార్, గాంధీనగర్‌లో విరివిగా లభిస్తున్నాయి. కొత్తపల్లి కొబ్బరి, బంగినపల్లి, చెరుకు రసాలు, సువర్ణరేఖ, నూజివీడు రసాలు కాకినాడ మార్కెట్‌లో ఎక్కువగా అమ్ముడుపోతున్నాయి. ఆల్‌ఫోన్సో వంటి దిగుబడి రకాలకు సంపన్నులతో మంచి డిమాండ్ ఉంది. కాకినాడ నగరంలో ఒక రోజులో రూ.5 నుంచి 8 లక్షల మధ్య మామిడి పండ్ల రిటైల్ వ్యాపారం జరుగుతోందని వ్యాపారులు అంటున్నారు.

ఆరోగ్య సమస్యలు అనేకం



రసాయనాలతో పండించిన మామిడి తింటే జీర్ణకోశ సమస్యలు తలెత్తుతాయి. అసిటిలిన్ గ్యాస్ వల్ల తలనొప్పి, మైగ్రేన్ సంభవిస్తుంది. వాంతులు, మలబద్ధకం ఏర్పడి జీర్ణవ్యవస్థ సాధారణ ప్రక్రియలో అసాధారణ మార్పులు వస్తాయి. ఛాతిలో మంట, పొట్ట నొప్పికి అవకాశం ఉంటుంది. పిల్లలు, గర్భిణులకు మరింత ప్రమాదం. కాల్షియం కార్బైడ్‌లో ఉండే ఆర్సెనిక్, ఫాస్పరస్ హైడ్రైడ్ రసాయనాలు శరీరంలో పేరుకుపోతే కాలేయం, మూత్రపిండాలు ప్రభావితమవుతాయి. నరాలు, హార్మోనల్ సమస్యలు ఉత్పన్నం కావచ్చు. రసాయనాలు అతిగా శరీరంలో పేరుకుపోతే కేన్సర్‌కు దారి తీయవచ్చు. ఈ ప్రభావాలన్నీ ఒకేసారి కనిపించకపోవచ్చు. కాని మామిడి పక్వానికి వినియోగించే రసాయనాలు అంచలంచెలుగా వ్యక్తి ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతాయి. మామిడి పండ్లను తినాలనుకునే వారు తగిన జాగ్రత్తలు అనుసరించాలి. రసాయన ఫలాల నియంత్రణకు ఫుడ్ సేఫ్టీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ యండ్రపాటి చిరంజీవి, జీజీహెచ్, కాకినాడ

తెల్లటి చారలు రసాయనాలే



మామిడి పండ్లపై తెల్లటి చారలు ఉంటే అవి రసాయనాలే. ఇవి అంటి ఉన్న మామిడి పండ్లను కొని అనారోగ్యాలు కొని తెచ్చుకోవద్దు. పిల్లలకు అసలు పెట్టొద్దు. పచ్చివి తెచ్చుకొని ముగ్గించుకోవడం శ్రేయస్కరం. కాకినాడకు పొరుగు జిల్లాల నుంచే కాక, పొరుగు రాష్ట్రాల నుంచి మామిడి పండ్లు సరఫరా అవుతాయి. ఉత్పత్తి పెరిగిందని ఆనందించే లోపే వర్షాలు వెన్ను విరిచాయి. వీటి ప్రభావంతో ధరలు గణనీయంగా తగ్గిపోయాయి.

– బి.రాజు, వ్యాపారి, కాకినాడ

ఆపరేషన్ సిందూర్ హర్షణీయం

- మత ఘర్షణలు లక్ష్యంగా తీవ్రవాద దాడులు తగదు
- పేదల సమస్యలపై పోరాటాలు ఆగవు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా



జిల్లా సీపీఐ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్‌రావు

కాకినాడ సిటీ: కాశ్మీర్‌లో హిందువులను లక్ష్యంగా చేసుకుని చంపి దేశంలో మత కల్లోలాలకు పాల్పడుతున్న పాకిస్తాన్ తీవ్రవాదుల చర్యలను ఖండిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్‌రావు అన్నారు. బుధవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో టి. అన్నవరం అధ్యక్షతన జరిగిన జిల్లా సీపీఐ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. శత్రు సైన్యాన్ని మెడలు వంచడంలో భారత్ కీలకపాత్ర పోషించిందని, ఆపరేషన్ సింధూర్ పేరులో ఉగ్రవాదుల స్థావరాలపై భారత్ దాడి హర్షించదగిన విషయమే అన్నారు. అర్హులైన పేద ప్రజలందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాల మంజూరు చేసే వరకు తమ పోరాటం ఆగదని, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు భూమిని, అర్బన్ ప్రాంతంలో రెండు సెంట్ల భూమిని మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు మంజూరు చేయాలన్నారు. జూన్ 2వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల స్థలాలపై ఆందోళన చేస్తున్నామన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల పేదలకు అండగా భారత కమ్యూనిస్టు పార్టీ ఉంటుందన్నారు. వందేళ్లు నిండిన సీపీఐ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. పార్టీ జాతీయ, రాష్ట్ర మహాసభలు జరగనున్న నేపథ్యంలో జిల్లా శాఖ, మండల, నియోజకవర్గ, పట్టణ మహాసభలు నిర్వహించి జులై 15, 16 తేదీల్లో సామర్లకోటలో జిల్లా మహాసభలు నిర్వహిస్తామన్నారు. పెన్షన్ల మంజూరు కోసం కూటమి ప్రభుత్వం వృద్ధులకు, వికలాంగులకు సదరమ్ సర్టిఫికెట్లు ఎంక్వయిరీ చేసిందని, ఇప్పటికే మంజూరు చేస్తున్న పెన్షన్లు రద్దు చేస్తే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతాని సీపీఐ జిల్లా నాయకులు ప్రకటించారు. సమావేశంలో ముందుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ ఇటీవల మృతి చెందిన దేశ రక్షణ సైనికులకు, హైదరాబాదులో షార్ట్‌సర్క్యూట్‌లో మృతి చెందిన వారికి, పార్టీ సానుభూతిపరులకు, అమర వీరులకు సంతాపం తెలియజేశారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు కామిరెడ్డి బోడకొండ, పెద్దిరెట్ల సత్యనారాయణ, పప్పు ఆదినారాయణ, కేశవరపు అప్పలరాజు, పెద్దిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యనారాయణరాజు

కాకినాడ రూరల్: వయో వృద్ధుల సంక్షేమానికి తెలంగాణ మాదిరిగా రాష్ట్రంలో డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణరాజు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యులు ఎవరి వ్యాపకాల్లో వారు బిజీగా ఉండడంతో వృద్ధులను పలకరించే నాథుడే కరవయ్యారన్నారు. దీంతో ఇంట్లో ఒంటరిగా కాలాన్ని వెళ్లదీస్తున్న వృద్ధులకు మానసిక సమస్యలకు గురవుతున్నందున డే కేర్ సెంటర్లు ఉపశమనం కలిగిస్తాయన్నారు. ఇక్కడ వైద్య పరీక్షలతో పాటు గ్రంథాలయం, క్యారమ్స్, టెన్నిస్, చెస్ వంటి ఆటలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డే కేర్ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, సత్యనారాయణ, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీ, డీఎస్సీ మోడల్ పేపర్ల ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: పీఆర్‌టీయూ, శ్యామ్ ఇనిస్టిట్యూట్, యంగ్ మైండ్స్ రేపటి కోసం స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా తయారు చేసిన ఎస్‌జీటీ, డీఎస్సీ మోడల్ టెస్ట్ పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో జేసీ రాహుల్ మీనా, ఆయా సంఘాల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ టెస్ట్ డీఎస్సీ, ఎస్‌జీటీ అభ్యర్థులకు ఎంతో ఉపయుక్తమని, నిష్ణాతులైన రాష్ట్రస్థాయి పురస్కార గ్రహీతలు, ఉపాధ్యాయులతో ఈ మోడల్ పేపర్ తయారు చేశామని సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ టెస్ట్ జరుగుతుందన్నారు. అభ్యర్థులు ముందుగానే తమ పేర్లను 9346287425 వాట్సాప్ మెసెజ్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. జేసీ రాహుల్ మీనా యంగ్‌మైండ్ స్వచ్ఛంద సంస్థ, పీఆర్‌టీయూ, శ్యామ్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులను అభినదించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చింతాడ ప్రదీప్‌కుమార్, యంగ్‌మైండ్స్ అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ, శ్యామ్ ఇనిస్టిట్యూట్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మనో వ్యవస్థ అవగాహనతో సంపూర్ణ సంతోషం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మనో సాహితీవేత్త శ్రీరామచంద్రమూర్తి

బోట్‌క్లబ్: వ్యక్తికి సంపూర్ణ ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు మనసు వ్యవస్థ అవగాహనతో చేకూరతాయని ప్రముఖ పండితులు మనో సాహితీ వేత్త సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి అన్నారు. స్థానిక సేవాభారతి కార్యాలయంలోని వాధూలసంలో బుధవారం వ్యక్తిత్వ వికాస సమాజం, గ్లోబల్ అసోసియేషన్ ఆఫ్ సైకాలజిస్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విశిష్ట మనో విజ్ఞాన శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ నెల 21వ తేదీ నుంచి 30 తేదీ వరకూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటలు వరకూ ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రముఖ సైకాలజిస్టులు వి.జనార్దనం, ఎస్.మహాలక్ష్మీకుమార్, వి.మనోహర్, ఉదయభాస్కర్, పి.సుబ్బరాజు, హైమ, కేశవాచార్యులు, కె.సుబ్బారావు, అక్కంశెట్టి రాంబాబు, బి.లక్ష్మీనారాయణ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు కార్మికుల సమ్మె

సామర్లకోట: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్టు కార్మికుల సమ్మె బుధవారం కూడా కొనసాగింది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈనెల 7వ తేదీ నుంచి నల్లబాడ్జీలు ధరించి నిరసనతో సమ్మెలోకి దిగారు. అయినా మున్సిపల్ అధికారులు, పాలకుల నుంచి ఎటువంటి స్పందన లేక పోవడంతో మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షలు ప్రారంభిం చిన విషయం తెలిసిందే. యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 15 ఏళ్ల సీనియారిటీ ఉన్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, విధులలో చనిపోయిన వారికి రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.ఐదు లక్షలు నష్ట పరిహారంతో పాటు కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఏడాదిలో 55 ఆదివారాలు, కేంద్ర, రాష్ట్ర పండగలకు 17 రోజులు సెలవులు ఇవ్వాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సీనియార్టీ ప్రాతిపదికలో వేతనాలు చెల్లించాలని, స్కిల్ వర్కర్లకు రూ.29,200, నాన్ స్కిల్ వర్కర్లకు రూ.24,500 వేతనాలు ఇవ్వాలనే డిమాండ్‌లు ప్రభుత్వం వద్ద ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించక పోతే జూలై 9వ తేదీ నుంచి పారిశుధ్య కార్మికులు కూడా సార్వత్రిక సమ్మెలోనికి దిగుతాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పులపకూర రామకృష్ణ, లంక శ్రీహరి, నక్క రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాత

సామర్లకోట: రాష్ట్ర ఎయిడ్స్ నిర్మూలన సంస్థ, జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు పెద్దాపురం వైజ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సంత మార్కెట్ సెంటర్‌లో ఎయిడ్స్‌పై అవగాహనకు కళాజాత ప్రదర్శించారు. సుఖ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలనే విధంగా నాటికలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో కార్యక్రమంలో ఐసీటీసీ కన్వీనర్ బి. శ్రీనివాసు, వైజ్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు బి.మల్లేశ్వరి, ప్రాజెక్టు డైరెక్టరు ఆర్.జయ, మేనేజరు ఎల్.శైలజ, ఎంఅండ్‌ఎఫ్ఏ వై.ప్రవీణ్, ఏఎన్ఎం మంగాదేవి పాల్గొన్నారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు



సామర్లకోటలోని ప్రసన్నాంజనేయస్వామి

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో గురువారం హనుమజ్జంతి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలు నుంచి స్వామి వారికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాగవల్లీ దళయుక్త గంధ సిందూరంతో విశేష అర్చన, వడమాల కైంకర్యం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు. స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయ ఆలయంలో హనుమజ్జంతి నిర్వహించనున్నట్లు ఈఓ ఉండవల్లి వీర్రాజు తెలిపారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

సామర్లకోట: హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం ఆలయాలలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక ప్రసన్నాంజనేయ ఆలయంలో ఉదయం నుంచి సామూహిక అభిషేకాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పారిశ్రామిక వేత్త మట్టే శ్రీనివాస్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు, సాయంత్రం 65 అడుగుల ఎత్తయిన ఆంజనేయస్వామికి పుష్పాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే మాండవ్య నారాయణస్వామి ఆలయంలో కొలువై ఉన్న ఆంజనేయ ఆలయంలో ఈఓ బిక్కిన వెంకట్రాయచౌదరి సూచనల మేరకు గురువారం ఉదయం స్వామికి అభిషేకాలు, తమలపాకుల పూజలు, పారాయణలు జరుగుతాయని అర్చకులు అనంత పద్మానాభాచార్యులు తెలిపారు. కాగా స్టేషన్ సెంటర్‌లోని వీరాంజనేయ ఆలయంలోను, కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న భక్తాంజనేయ ఆలయంలోను ప్రత్యేక పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు శోభాయాత్ర

హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ నాయకులు తెలిపారు. శోభాయాత్రను శృంగవృక్షానికి చెందిన దత్త పీఠాధిపతి సాయిదత్త నాగా నంద సరస్వతి స్వామిజీ ప్రారంభిస్తారన్నారు. ప్రతి హిందూ కుటుంబం నుంచి ర్యాలీలో పాల్గొన్నాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

పెద్దాపురం: స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన కేవీ పద్మావతిని సీడీఎంఈకు రిపోర్ట్ చెయ్యాలని ఆదేశాలు అందడంతో ఆమె స్థానంలో శ్రీకాంత్‌రెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈయన కాకినాడ కార్పొరేషన్‌లో కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పురప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. పట్టణ పరిశుభ్రతతో పాటు పట్టణాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. తొలుత మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి ఆధ్వర్యంలో ఆయనకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.

కొత్తపల్లిలో కుండపోత వర్షం



సముద్రంలో ఎగసిపడుతున్న అలలు

కొత్తపల్లి: తుపాను ప్రభావంతో బుధవారం ఎడతెరిపి లేకుండా కుండాపోత వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి ప్రజలు ఇబ్బంది పడ్డారు. కొన్నిచోట్ల చెట్ల కొమ్ములు విరగడంతో పాటు, మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. చేతికి అంది వచ్చిన మామిడికాయలు గాలికి రాలిపోవడంతో రైతులకు నష్టం చేకూరింది. ప్రస్తుతం వేట నిషేధం అమలులో ఉన్న నేపథ్యంలో నాటు పడవలపై మాత్రమే మత్స్యకారులు వేటకు వెళుతున్నారు. సముద్రంలో ప్రతికూల పరిస్థితుల్లో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.



భారీగా కురుస్తున్న వర్షం